## నమస్తే తెలంగాణ

# ఉద్యోగ మిత్ర

**ఉద్యోగులే** ప్రభుత్వ కార్యక్రమాల సారథులని, పరిపాలనా వ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధులని ముఖ్యమంత్రి కేసీఆర్ గట్టిగా నమ్ముతారు. ఉద్యమకాలం నుంచీ వారితో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. వారి యోగక్షేమాల మీద ఆయన నిరంతరం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. మొదటి పీఆర్సీతో దేశంలోనే అత్యధిక వేతనాలు పొందే ఉద్యోగులుగా వారిని నిలబెట్టిన సీఎం కేసీఆర్ తాజాగా మరో పీఆర్సీ ప్రకటించి శుభవార్త తెలిపారు. పెరిగిన జీవన వ్యయాలకు అనుగుణంగా వారి వేతనాలు పెరగాలని గత ఆగస్టు 6న అసెంబ్లీ వేదికగా ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారు.

తెలంగాణ ఏర్పాటైన తర్వాత సీఆర్ బిస్వాల్ అధ్యక్షతన మొదటి పీఆర్సీ వేసిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు శివశంకర్ నేతృత్వంలో రెండో పీఆర్సీ ఏర్పాటు చేసింది. దీంతోపాటుగా అక్టోబర్ నెల నుంచి 5 శాతం మధ్యంతర భృతిని కూడా మంజూరు చేయడం ముదావహం. దీనివల్ల ఖజానాపై రూ.2 వేల కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా. వేతన సవరణ జరిగితే ఈ వ్యయం మరింత పెరుగుతుందని చెప్పొచ్చు. ఈ సరికే దేశంలో అత్యధిక వేతనం పొందుతున్న తెలంగాణ ఉద్యోగులకు తాజా పీఆర్సీ వల్ల మరింత లబ్ధి చేకూరనున్నది. అభివృద్ధి, సంక్షేమాలతో పాటుగా ఉద్యోగుల వేతనాల్లోనూ తెలంగాణ నంబర్‌వన్‌గా నిలవడం గమనార్హం. అంగన్వాడీ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ పీఆర్సీ వర్తింపజేయాలని నిర్ణయించడం ప్రభుత్వం పెద్దమనసుకు నిదర్శనం. ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాలతో పాటుగా పింఛనర్లకు పింఛన్లు పెరుగనుండటం హర్షణీయం. సమైక్య రాష్ట్రంలో పీఆర్సీ కోసం ఉద్యోగులు పోరుబాట పట్టినా అప్పటి ప్రభుత్వాలు స్పందించేవి కావు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ఇప్పటి ప్రభుత్వం అడగకుండానే వరాలిస్తూ 'ఉద్యోగ మిత్ర' అనే బిరుదును సార్థకం చేసుకుంటున్నది. గత జూలై 3న లాంఛనంగా ఉద్యోగ సంఘాల నేతలు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి వేతన సవరణ గురించి విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత మూడురోజులకే అసెంబ్లీలో హామీ ఇచ్చి నెల తిరక్కుండానే ఆ హామీని నిలబెట్టుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. పెరిగే ఖర్చుల రీత్యా నిరంతర వేతన సవరణ అనేది ఉద్యోగితో ప్రభుత్వానికి ఉండే అనుబంధాన్ని మరింత పటిష్టపరుస్తుంది. నిరంతరం వారిని కార్యోన్ముఖులను చేసే చోదకశక్తిగా పనిచేస్తుంది. ఇదివరకు వేతన సవరణ కమిటీ సిఫారసు చేసిన స్థాయికి మించి వేతనాలు పెంచిన తెలంగాణ మరోసారి తగిన స్థాయిలో లబ్ధి చేకూరుస్తుందని భావించవచ్చు. మొదటి పీఆర్సీ ఏడున్నర శాతం ఫిట్ మెంట్ సిఫారసు చేస్తే తెలంగాణ ప్రభుత్వం ఏకంగా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ఉద్యోగులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచింది. దానివల్ల రూ.12.5 వేల కోట్ల అదనపు భారం పడినా సర్కారు వెనుకంజ వేయకుండా అమలు చేసింది. కరోనా కల్లోలం, ఆర్థికపరమైన చిక్కులు ఎన్ని ఎదురైనా ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం చెరగని చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నది. తాజా పీఆర్సీ ప్రకటనతో సహజంగానే ఉద్యోగుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించడం ప్రశంసనీయం.

# నోటిమాటతో రాదు నీటి ఊట

**గుక్కెడు నీళ్ల కోసం చాంతాడు, బొక్కెన పట్టుకొని కోసుల దూరం నడిచిపోయి బిందెలల్లో తెచ్చుకునే రోజులను చూసినం. సర్కారు నల్లాల దగ్గర ఒకటెన్క ఒకటి బిందెనో, బకీటో పెట్టి నీళ్లు వచ్చే టైం కోసం ఎదురుచూసేది. లైన్‌లో బింది ఇటో అటో అయిందంటే, బిందెలతోనే కొట్టుకున్న రోజులున్నయి. ఆ రోజులు గుర్తుకొస్తేనే వామ్మో.. నీళ్ల కోసం పడ్డ తిప్పలు కండ్లముందు కనవడ్తున్నయి!**



వాణీ మనోహర్



ఓసారి భారత దేశాధ్యక్షుడు అబ్దుల్ కలాం గ్రామాల సర్పంచులందరికీ నీళ్లను మనం పొదుపుగా వాడుకోకుంటే ఎంత నష్టం జరుగుతుందో ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేసి, సీడీలను విడుదల చేశారు. మనకు లభ్యమయ్యే నీళ్లను యథేచ్ఛగా, ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు ఖర్చుజేస్తూ పోతే రాబోయేతరానికి మనం నీళ్ల కరువు, కాటకాలను మాత్రమే కానుకగా ఇచ్చినవాళ్లమవుతాం. రాబోయేతరం వాళ్ల కోపానికి మనం బలి కావలసిందే. వారి అసాధారణ, అనారోగ్య పరిస్థితికి మనమే బాధ్యులమవుతాం. వర్షాల ద్వారా వచ్చే నీళ్లను ఒడిసిపట్టి ఏదో విధంగా, భద్రంగా, దాచుకుంటూ, విరివిగా ఖర్చుచేయకుండా పొదుపు చేసుకుంటూ వాడుకోవాలి. లేకుంటే చిన్న చిన్న కుంటల దగ్గర కూడా సైనికులను పహారా పెట్టి కాపాడుకోవలసిన పరిస్థితి వస్తుందని అబ్దుల్ కలాం చెప్పారు.

వచ్చే తరంలో మనుషులు 30, 40 ఏండ్లు వచ్చే సరికే, మనం 70, 80లల్లో ఎలా ఉంటామో అలా ఉంటారట. ఆడవాళ్లందరూ, బట్టతలలతోనే ఉంటారట, నీళ్లు సమృద్ధిగా ఉండవు కాబట్టి. ఇండ్లను, ఇంటి ముందు వాకిలిని, స్కూటర్లను, కార్లను ఇప్పుడు మనం పైపుతో కడగడం విని.. 'ఇంత విలువైన నీళ్లను మీరెలా వృథా చేశార'ని మన పిల్లలే మనల్ని ప్రశ్నించి అసహ్యించుకుంటారట. నా చిన్నప్పుడు 'ఢిల్లీలో ఒక గ్లాసు నీళ్లకు ఐదు పైసలట' అని విని నీళ్లను అమ్ముకుంటారా ఎవరైనా అని ఆశ్చర్యపోయాను. అబ్బో అక్కడి ప్రజలూ ఎలా బతుకుతున్నారో అనుకునేది. ఇప్పుడు మనం వంద రూపాయలు పెట్టి కూడా కొంటున్నాం. నీళ్లను కూడా కొనవలసి వస్తుందని అనుకున్నామా?రా్రానాను, బకెట్ నీళ్లకు పదివేల రూపాయలైనా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇప్పుడు దాదాపు అందరికీ జీతభత్యాలు పెరిగి ఉండవచ్చు. ఆ ధీమాతోనే పది వేలైనా సరే కొనుక్కోగలుగుతమేమో. కానీ, నీళ్లే లేకుంటే? ఒకసారి ఆలోచించాలి.

కాబట్టి ఎన్ని నీళ్లు మనం సముద్రంలో కలవకుండా, అన్ని నీళ్లను నిల్వ చేసుకుంటే, వర్షం కురిసినప్పుడు ప్రతి నీటి చుక్కను ఎంత ఆదా చేసుకుంటే అంత మంచిది. లక్ష పెట్టి నాలుగు బిందెలు కొందామన్నా, నీళ్ల లభ్యత ఉంటే గదా, అది సాధ్యమయ్యేది అన్నది ఆలోచించాలి. అందువల్ల నీటి మట్టం, భూగర్భ జలాలు పెరిగేటట్టు ఎన్నివిధాలు/ మార్గాలుంటే అన్ని మార్గాలు అన్వేషించి అమలు పరచవలసిందే. దీని గురించి అందరమూ ఆలోచించాల్సిందే, సహకరించాల్సిందే, కలిసి పనిచెయ్యాల్సిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని నీళ్ల కొరత వల్ల ఎన్ని కష్టాలో, నష్టాలో తెలిసే, రాష్ట్రం సాధించిన తర్వాత మున్ముందు తరాలకు నష్టం కలుగకుండా ఉండేందుకు నీటికే ప్రాధాన్యం ఇచ్చి, నలభై వేలకు పైగా చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంలు కట్టడం, కాళేశ్వరం ప్రాజెక్టులు, పలు రిజర్వాయర్లు నిర్మించడం మొదలైన కార్యక్రమాల ద్వారా తెలంగాణ ప్రభుత్వం నీటి నిల్వలు పెరిగేట్టు చూస్తున్నది. అందువల్లనే ఇప్పుడు తెలంగాణలో పరిస్థితి గడ్డుగా లేదని, కొంత మెరుగు పడిందని ఇటీవలే విడుదల చేసిన సీడబ్ల్యూసీ గణాంకాలు చెప్తున్నాయి. ఈ ఏడాది తగిన వర్షాలు లేకున్నా, గత పదేండ్ల సగటు కంటే ఎక్కువగా నీటి నిల్వలున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి రాష్ట్రంగా నిలిచిందని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పేర్కొనడం మహా ఆనందాన్నిచ్చే విషయం.

**పదేండ్ల సగటు నీటి నిల్వల కంటే ఎక్కువున్న రాష్ట్రాల సంఖ్య 5 మాత్రమేనని చెప్పుకోవడం సిగ్గుచేటు. తెలంగాణలో 68.3 శాతంగా నమోదైతే, 14.6 శాతంతో తర్వాతి స్థానాన్ని గుజరాత్ సాధించింది. 12.1 శాతంతో 3వ స్థానంలో ఉత్తరాఖండ్, మిగతా రెండు రాష్ట్రాలు సింగిల్ డిజిట్‌తోనే సరిపెట్టుకోవడం విషాదం. తెలంగాణ పొరుగు రాష్ట్రాల్లో పదేండ్ల సగటు నిల్వల కంటే తక్కువగా కర్ణాటక మైనస్ 28.6 శాతం, మహారాష్ట్ర మైనస్ 8.9 శాతం, ఒడిశా మైనస్ 13.9 శాతంగా నమోదు చేసుకున్నాయి.**

దేశంలోని 24 రాష్ట్రాలు పదేండ్ల సగటు మైనస్‌లో ఉండటం, ఉంచడం చాలా విచారకరం. నీటి నిల్వల సామర్థ్యం పెంచుకోకుంటే ఎంత అనర్థమో, పెంచుకుంటే ఎంత ఆనందదాయకమో, ప్రయోజనకరమో, ఎంత అత్యావశ్యకమో పైన చెప్పుకొన్నాం. ఈ విషమ పరిస్థితి గమనించి అన్ని రాష్ట్రాల నాయకులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తరాలు మనల్ని నిందించకుండా ఉండాలంటే వారికి సమృద్ధిగా నీళ్లు లభ్యమయేట్టు చూడవలసిన బాధ్యత మనందరిది. ఆ దిశగా అడుగులు పడాలని ఆశిద్దాం.

# హైదరాబాద్‌కు మరింత శోభ

**హైదరాబాద్ నగరం, మూసీ నది అవిభక్త కవలలు. స్వచ్ఛమైన మూసీనది ఒడ్డున అందాల హైదరాబాద్ నగరం నిర్మించబడింది. కానీ సీమాంధ్ర వలస పాలనలో వివక్ష, వినాశకర విధానాలతో హైదరాబాద్ నగరం తన ప్రభను కోల్పోయింది. మూసీ నదిని వారు మురికికూపంగా, డంపయార్డుగా మార్చారు. సీమాంధ్ర పాలకుల వల్ల హైదరాబాద్‌లో జరిగిన విధ్వంసాన్ని సరిచేయడం కోసం కేసీఆర్ గత తొమ్మిదేండ్లుగా హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. హైదరాబాద్ నగరాన్ని పునఃనిర్మిస్తున్నారు. అట్లాగే మూసీనది పునరుజ్జీవం కోసం మూసీ రివర్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయడమే కాకుండా గోదావరిని మూసీనదితో అనుసంధానం చేసే మహత్తర కార్యక్రమానికి పూనుకున్నారు.**



డి.రాజారాం యాదవ్
97051 31472



కేసీఆర్ పదే పదే చెప్తున్నట్టుగా హైదరాబాద్ నగరం చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నది. ఇది అప్పటికప్పుడు చంద్రబాబు లాంటి ఒకరిద్దరు సీమాంధ్ర పాలకులచే నిర్మించబడలేదు, అభివృద్ధి చెందలేదు. వారిది ఇత్తేసి పొత్తుగూడె మొండి, తొండి వైఖరి. పైపెచ్చు వారి నిర్వాకం వల్లనే ప్రపంచంలో ఒక గొప్ప నగరంగా పేరున్న హైదరాబాద్ నగరం ధ్వంసమైంది. వారి నిర్లక్ష్య, వివక్షాపూరిత పాలనలో మూసీనది పరీవాహక ప్రాంతం అత్యంత కాలుష్య వాతావరణంలోకి నెట్టబడింది.

తెలంగాణ సిద్ధించి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేనాటికి మూసీ నది గృహ, పారిశ్రామిక, ఫార్మా, డ్రగ్ ఇండస్ట్రీస్ వ్యర్థాలను వదిలే ఒక డంప్‌యార్డ్, భారతదేశంలో ఉన్న అత్యంత విషపూరితమైన జలాలు గల నది. మూసీనది అంటే పాత కొత్త హైదరాబాద్‌లను వేరు చేసే ఒక సరిహద్దు విభజన రేఖ. పేద, ధనిక వర్గాలు విడివిడిగా నివసించే ఒక అడ్డుగోడ. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన మూలవాసుల వలస జీవుల మురికివాడలు గల ప్రాంతం.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 2014-15 నుంచే హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవ అవసరాన్ని గుర్తించి కేసీఆర్ మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేశారు. దీనిద్వారా దాదాపు 55 కిలో మీటర్ల మేరకు మూసీనది, పరీవాహక ప్రాంతాన్ని పర్యావరణహితంగా అభివృద్ధి చేశారు. దీనికి రూ.16,635 కోట్లు కేటాయించి మూసీ ఇసా నదులపై రోడ్లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీ), ప్యారిస్, గ్రీస్ తరహా బ్రిడ్జిలను నిర్మించనున్నారు. అందులో భాగంగానే మొన్న కేటీఆర్ మూసీ ఇసా నదులపై 7 బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు. ఓఆర్ఆర్ తరహాలో పశ్చిమవైపు నుంచి తూర్పు దిక్కుకు వెంట రోడ్ కమ్ ఎలివేటెడ్ బ్రిడ్జిని నిర్మించబోతున్నామని అందుకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామని మొన్న కేటీఆర్ ప్రకటించారు. దీంతో చారిత్రక పాత హైదరాబాద్‌కు మరింత ప్రాధాన్యం పెరుగనున్నది. మూసీ నదికి ఇరువైపులా జీవించే ప్రజలకు మెరుగైన ఆధునిక సౌకర్యాలు లభించబోతున్నాయి. హైదరాబాద్ మూసీ అందాలు ద్విగుణీకృతం కానున్నవి.


రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా గోదావరిని మూసీతో అనుసంధానం చేసే మరో బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిద్వారా కొండపోచమ్మ నుంచి గండిపేటకు రూ.1,250 కోట్ల ఖర్చుతో గోదావరి నీటిని తీసుకువస్తారు. గండిపేట నుంచి దిగువకు గోదావరి నీటిని మూసిలోకి వదలడం వల్ల మూసీనది సజీవ నదిగా మారబోతున్నది. దీన్ని ఎవరూ కలలో కూడా ఊహించి ఉండరు. కానీ కేసీఆర్ కలలు కని, వాటిని సాకారం చేసి అద్భుతాలు సృష్టిస్తున్నారు.

తెలంగాణ గుండెకాయ, ప్రగతి రథచక్రమైన హైదరాబాద్‌ను విశ్వనగరంగా ఎదిగించాలనే లక్ష్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఎస్ఆర్‌డీపీ (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), ఎస్ఎన్‌డీపీ (స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) అనే ప్రత్యేక కార్యక్రమం తీసుకొని ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు, కేబుల్ బ్రిడ్జిలు, స్టీల్ బ్రిడ్జిలు, స్కైవేలను నిర్మాణం చేసి కేవలం తొమ్మిదేండ్లలోనే హైదరాబాద్‌లో భారతదేశంలో ఏ ఇతర నగరాల్లో లేనటువంటి మౌలిక వసతులను ఏర్పాటు చేసింది. మొన్న కేసీఆర్ 2వ దశ మెట్రో విస్తరణ ప్రకటనతో హైదరాబాద్ నగర అభివృద్ధి మరింత వేగం కానున్నది.

బహుముఖ వ్యూహంతో హైదరాబాద్ నగరాన్ని ఒకవైపు అభివృద్ధి చేస్తూనే మరోవైపు పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నది. నగర ప్రజలను కాలుష్యం నుంచి, మానసిక ఒత్తిడి నుంచి రక్షించి వారికి ఆరోగ్య, ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నది. అందుకుగాను తెలంగాణ ప్రభుత్వం అర్బన్ ఫారెస్టు విధానంలో భాగంగా అర్బన్‌లంగ్ స్పేస్‌లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ చుట్టూ గల ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యగల చిన్నచిన్న పట్టణాలను గార్డెన్ సిటీలుగా, పాలిసెంట్రిక్ సిటీలుగా మార్చాలనే ప్రయత్నం చేస్తున్నది.

**మంత్రి కే తారక రామారావు కృషితో పారిశ్రామిక, వ్యాపార రంగాలతో పాటుగా ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, యానిమేషన్, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఘనమైన అభివృద్ధిని సాధించింది. కేటీఆర్ కృషి ఫలితంగా సామాజిక, ఆర్థిక, వాణిజ్య, రియల్ ఎస్టేట్ రంగాల్లో అత్యంత క్రియాశీలక నగరంగా హైదరాబాద్ అవతరించింది. అతి తక్కువ కాలంలోనే విశ్వ నగరాల్లో ఒకనగరంగా మారింది.**

తెలంగాణలో సుస్థిర పాలన, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ అనుకూలతలతో పాటు పారదర్శక పాలన వల్ల హైదరాబాద్ నగరం పెట్టుబడులకు స్వర్గధామమైంది. ముఖ్యంగా మంత్రి కే తారక రామారావు కృషితో పారిశ్రామిక, వ్యాపారరంగాలతో పాటుగా ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, యానిమేషన్, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఘనమైన అభివృద్ధిని సాధించింది. కేటీఆర్ కృషి ఫలితంగా సామాజిక, ఆర్థిక, వాణిజ్య, రియల్ ఎస్టేట్ రంగాల్లో అత్యంత క్రియాశీలక నగరంగా హైదరాబాద్ అవతరించింది. అతి తక్కువ కాలంలోనే విశ్వ నగరాల్లో ఒక నగరంగా మారింది. హైదరాబాద్ తన పూర్వవైభవాన్ని సంతరించుకొంటున్నది. ఈ అభివృద్ధిలో మూసీ నదికి ఇరువైపుల గల పాత హైదరాబాద్ నగర ప్రజలను భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో మూసీనది పునరుజ్జీవ కార్యక్రమానికి కేసీఆర్ పూనుకున్నారు. సమగ్ర, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధియే నిజమైన అభివృద్ధి అని ఆచరణలో చూపిస్తున్నారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగడం కోసం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఎంతైనా ఉన్నది.




## అణచివేయడం కోసమే ఆపేశారు!

*1881లో జనాభా లెక్కలు మొదలైనప్పటి నుంచి ఎప్పుడూ వాటిని నిర్వహించకుండా ఉండలేదు. ప్రపంచ యుద్ధాల సమయంలోనూ వాటిని ఆపలేదు. కానీ మోదీ ఆ పని చేశారు! మనువాద సామాజిక అణచివేతను బలపరిచేందుకు కుల గణనను తిరస్కరిస్తున్నారు. అదే సమయంలో ఓబీసీల ప్రయోజనాలను కాపాడేది తామేనని ప్రగల్భాలు పలుకుతున్నారు. ఈ క్రూరమైన కపటత్వాన్ని ఓడించండి.*

**- సీతారాం ఏచూరి, జనరల్ సెక్రటరీ, సీపీఎం**





విదేశీ ప్రతినిధులతో రవీందర్ రేనా

# ప్రపంచ ఆర్థికవేత్తగా తెలంగాణ బిడ్డ

**సాధన చేయుమురా నరుడా సాధ్యం కానిది లేదురా!
అలవాటైతే విషమే అయినా హాయిగా తాగుట సాధ్యమురా!**



కోట దామోదర్
9391480475

దాశరథి రచించిన ఈ పాట భక్తులకు భగవంతుని పట్ల మరింత భక్తిని కలిగించింది. ఎంతోమంది నిరాశాపరులను ఉత్సాహపరిచింది. నిరుపేద విద్యార్థులను ప్రభావితం చేస్తూ వారిని ప్రయోజకులను చేసింది. చదువుకు పేదరికం అడ్డంకి కాదని, అవరోధాలను అవకాశాలుగా మార్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా స్ఫూర్తినిచ్చింది. ఈ చదువులు మనకెందుకులే అనుకున్న నిరుపేద విద్యార్థుల మదిలో చదువాలనే ఆశను రేకెత్తించింది. వారి ప్రతిభను ఖండాంతర ఖ్యాతి గడించేలా చేసింది. పల్లె వాసులను పట్నం వైపు వెళ్లేలా ప్రభావితం చేసింది. పల్లెటూరి ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పింది.

**మనిషై పుట్టినవాడు కారాదు మట్టిబొమ్మ!
పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ!**

అన్నట్టుగా ప్రతి మనిషికి సాధించాలనే పట్టుదల, దృఢ సంకల్పం, తపన, తపస్సు ఉంటే మనిషి సాధించలేనిదేదీ లేదనడంలో సందేహం లేదు. ప్రతి మనిషి జీవితంలో అవరోధాలు, ఆటంకాలు సహజమే కానీ వాటిని అవకాశాలుగా మలచుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించిన ఉస్మానియాలో వికసించిన పేదింటి విద్యా కుసుమం రవీందర్ రేనా.

రవీందర్ రేనా కరీంనగర్ జిల్లా, ఎర్రబెల్లి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబానికి చెందిన తెలంగాణ బిడ్డ. చంద్రమౌళి, రాజమ్మ దంపతులకు 1969, సెప్టెంబర్ 18న జన్మించారు. 1975 నాటి కాలంలో ఎర్రబెల్లి గ్రామం ఎలాంటి సౌకర్యాలు నోచుకోని పల్లె. కనీసం బస్సు, కరెంటు, తాగునీరు సౌకర్యం లేని గ్రామం. ఎర్రబెల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 1వ నుంచి 7వ తరగతి వరకు ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. చిన్న చిన్న పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆయన ప్రతిభకు పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్ రావడం విశేషం. ఎం.ఫిల్. ఎకనామిక్స్‌లో ఎం.ఏ., వరంగల్‌లోని కేయూ నుంచి ఎల్ఎల్‌బీ, తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ నుంచి బీఈడీ, కాకతీయ యూనివర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో బీఏ పూర్తిచేశారు.

**బీసీ రిజర్వేషన్ కోసం పోరాటం: 1995లో ఉస్మానియాలో చదువుతున్న సమయంలో బీసీల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని విద్యార్థి నాయకుడిగా రవీందర్ రేనా పోరాడారు. ఆ సమయంలో ఉస్మానియా విద్యార్థులు పెద్దసంఖ్యలో ఢిల్లీ వెళ్లి అప్పటి ప్రధాని పీవీతో చర్చలు జరిపారు. ఆ చర్చల్లో బీసీలకు సముచిత రిజర్వేషన్లు కల్పించాలని రవీందర్ రేనా తన వాదనలు వినిపించారు.**

సర్కార్ బడి నుంచి అంతర్జాతీయ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఎదిగిన తెలంగాణ వ్యక్తి, స్నేహశీలి, మృదుస్వభావి, విద్యావేత్త, అనన్య ప్రతిభ కలిగిన రచయిత, సంపాదకుడు, సలహాదారు, బహుభాషా కోవిదుడు రవీందర్ రేనా. ఆయన ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, ఎన్నో అవరోధాలను ఎదుర్కొని స్వయం కృషితో అసామాన్య విద్యావేత్తగా, అంతర్జాతీయ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఆసియా-పసిఫిక్, ఆఫ్రికాలో 31 ఏండ్లకు పైగా బోధన, పరిశోధన రంగంలో రాణించారు. ఆయన ప్రతిభను గుర్తించి ఆయా దేశాలు అంతర్జాతీయ అత్యున్నత పురస్కారాలతో సత్కరించడం తెలంగాణ ప్రజలకు గర్వకారణం. రవీందర్ రేనా ప్రస్తుతం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ వరల్డ్ ఎకానమీ, ఫ్యాకల్టీ ఆఫ్ ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఉన్నత చదువులు చదివి, అంతర్జాతీయ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నప్పటికీ ఆయనది ఒదిగి ఉండే తత్వం. మూర్తీభవించిన మానవత్వానికి మరో పేరు రవీందర్ రేనా. పలు దేశాల్లో ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ స్వదేశంపై మమకారంతో నిర్విఘ్నంగా, నిర్విరామంగా శ్రీశ్రీ విశ్వవిద్యాలయం వంటి సంస్థలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, న్యూఢిల్లీలోని స్పర్స్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ, తన కొడుకు, కుమార్తెను స్వదేశంలోనే చదివిస్తుండటం స్వదేశంపై ఆయనకున్న ప్రేమను తెలియజేస్తున్నది. బోధన, పరిశోధనలో ఆయనకు 31 ఏండ్ల అనుభవం ఉంది. 26 ఏండ్లుగా ఆయన విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. ప్రపంచ స్థాయి వేదికలపై పలు సామాజిక, ఆర్థిక సమస్యలపై విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. 42 కంటే ఎక్కువ దేశాలు సందర్శించారు. ఎరిట్రియా, పాపువా న్యూగినియా, నమీబియా, దక్షిణాఫ్రికా, రష్యా, స్విట్జర్లాండ్ మొదలైన దేశాల్లో పనిచేశారు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన రవీందర్ రానే జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శం.

**ఆశయ సాధనకు పేదరికం అడ్డు కాదు, ప్రతి విద్యార్థి తన సంకల్పాన్ని ఏకలవ్యుడి బాణంలా ఎక్కుపెట్టి లక్ష్యసాధనే ఊపిరిగా తను అనుకున్న గమ్యం చేరుకునే దిశగా పట్టుసడలని ప్రయత్నం చేస్తూ సాధించేవరకు శ్రమించాలి. అప్పుడే విజయం మన సొంతం అవుతుంది. అసాధ్యమనే పదంలో అ అనే అక్షరాన్ని పక్కనపెడితే మనిషి జీవితంలో ఏదైనా సాధ్యమే. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, దృఢ సంకల్పం, కృషి ఉంటే విజయం సాధించడం తథ్యం. సమస్యలు వచ్చాయని సతమతమవకుండా అవరోధాలన్నింటినీ అవకాశాలుగా మలచుకొని నిరంతర కృషితో తమ ఆశయాలను నెరవేర్చుకోవాలని పలు అంతర్జాతీయ సదస్సుల్లో యువతకు రవీందర్ రానే సందేశాన్నివ్వడం ఆహ్వానించదగిన పరిణామం.**